# వినాయకచవితి 'కాలమ్ దాటని కథల' పోటీలో ఎన్నికైన కథలు



## తివిరి ఇసుమున...

"శెట్టిగారి చిల్లర వంద, రాసుకోవోయ్" అన్నాను కొట్లో అడుగు పెడుతూనే వెనకనున్న మూకని ఉద్దేశించి.

ఒకేసారి గుంపుగా దూరిన మాకేసి ఆందోళనగా చూశాడు శెట్టి.

"కంగారుపడకండి సార్ మొన్న మునగాడకాలనీ కాలిపోయింది కదా, బాధితుల సహాయార్థం మీ వంటి పుణ్యాత్ముల దగ్గర తలోవంద వసూలు చేస్తున్నాం" అన్నాను.

"వందా, ఎవుడి బాబు సొమ్ము!రూపాయి రాసుకో" అంటూ గల్లా పెట్టె వెతికి వెతికి ఓ చింకి నోటు పైకి తీశాడు.

"తప్పు సార్...పాపం వాళ్ళు తింటానికి తిండి లేక, ఉండడానికి నీడలేక, ఒళ్ళు కప్పుకోవడానికి..."

నా మాట పూర్తి కానేలేదు,శెట్టి గయ్‌న లేచాడు. "అల్లందరి కోసం వాకాల్తా పుచ్చుకున్నావేటి, అడిగినంతా ఇవ్వడానికి!రూపాయి రాసుకో: ఆ మీద అరిచి గీ పెట్టినా వుంకో నయాకానీ ఇచ్చేది లేదు."

"ఇంతకీ వందివ్వనంటావు?" అన్నాను సీరియస్‌గా శెట్టి మొహంలోకి చూస్తూ.

"ఇవ్వను."

"ఎలా ఇవ్వవో నేనూ చూస్తాను. వందకి స్లిప్ రాయవోయ్" అన్నాను మూర్తికేసి చూసి.

అనడమే తరువాయి వందకి స్లిప్ కట్ చేశాడు మూర్తి. దాన్ని శెట్టిగారి గల్లా పెట్టె మీదకి విసిరి "మళ్ళా వస్తాను" అన్నాను వెనుతిరిగి.

మూడ్రోజుల తరువాత దూరంగా నిలబడి ఓ వందనోటిచ్చి పంపేను మూర్తిని, శెట్టి దుకాణానికి వెళ్ళి ఓ సబ్బు పట్టుకమ్మని.

అయిదు నిముషాల తరువాత అతనొచ్చి సబ్బు, చిల్లర నోట్లు తెచ్చి ఇచ్చేడు.

కాసేపోయాక నేను వెళ్ళాను.

"టూత్ బ్రష్షుందా?"

"ఉంది" అన్నాడు శెట్టి ఎవరికో ఏదో తూస్తూ.

"ఒకటివ్వు" అన్నాను.

శెట్టి బ్రష్ అందించగానే డబ్బు లివ్వకుండా ఓ పది నిముషాలు అక్కడే నిలబడ్డాను. శెట్టి కొంతసేపు ఇతర కస్టమర్ల సంగతి చూసి నా కేసి తిరిగాడు.

"ఇంకేం కావాలి?"

"ఇంకేం వద్దు. డబ్బు లిచ్చెయ్ పోతాను" అన్నాను.

"ఏం డబ్బులు?"

"వందిచ్చేను కదా" అన్నాను చాలా కేజువల్‌గా.

"ఇదిగో పిచ్చి వేషాలెయ్యకు,ముందు డబ్బు లియ్యి" అన్నాడు శెట్టి.

"పళ్ళు రాల గొడతాను. వందనోటు పెట్లో పడేసి కాని లేదంటావా?" గట్టిగా అరిచేను.

"నీకు దణ్ణం పెడతాను బాబో వందివ్వలేదు" అన్నాడు శెట్టి ఏడుపు గొట్టు మొహం పెట్టి.

"ఇచ్చేనయ్యా, బాగా జ్ఞాపకం తెచ్చుకో కావాలంటే..." అంటూ జేబులోంచి మరిన్ని నోట్లు తీశాను. వాటికి అక్కడక్కడ పసుపు అంటుకొని వుంది.

"ఆ వందనోటుకి కూడా పసుపు అంటుకొని వుంటుంది చూడు" అన్నాను.

"చూడు చూడు" అన్నారు ఒకరిద్దరు కస్టమర్లు. ఇంక లాభం లేదని చెప్పి పెట్టె తెరచి నోట్లు పరిశీలించడం మొదలుపెట్టేడు శెట్టి.

ఓ వందనోటుకి పసుపు అంటుకొని వుంది.

వెంకట్రావ్



## న్యూసెన్స్

కోర్టులో విచారణ జరుగుతోంది.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేచి గొంతు సవరించుకొని చెప్పాడు.

"మి లార్డ్! ఈ ముగ్గురు నిందితులు ఒక పబ్లిక్ పార్కులో త్రాగి న్యూసెన్స్‌గా వ్యవహరించి, అక్కడి వాళ్ళపట్ల అమర్యాదకరంగా ప్రవర్తించి నానా అల్లరి చేసారు"

జడ్జి ముగ్గురు నిందితులను చూసాడు. ముగ్గురూ బోనులో నిలబడివున్నారు. ఒక్కొక్కరికి పాతికేళ్ళు కూడా వుండవు.

వారిని చూచి జాలేసింది జడ్జికి.

ఒక్కొక్కరిని ప్రశ్నించాడు.

"మీ మీద చేసిన ఆరోపణ విన్నారుగా! చెప్పు నువ్వేం చేశావ్ పార్కులో" మొదటి వ్యక్తిని అడిగాడు.

"నేనేం చేయలేదు సార్! ఏమీ తోచక పార్కులోకి వచ్చాము. నేను చిన్న రాయిని తీసుకొని పార్కులోని ఫౌంటెన్‌లోకి విసరసాగాను. అంతే. ఇంకేం చేయలేదు సార్" వినయంగా చెప్పాడు ఆ వ్యక్తి. ఆశ్చర్యపోయాడు జడ్జి.

'ఇదేమంత న్యూసెన్స్ వ్యవహారంలాలేదే! ఏమీ తోచక రాళ్ళు తీసుకొని ఫౌంటెన్‌లోకి విసరడం మామూలే. ఈ కేసు కొట్టేయాలి. ఈ పోలీసులకు ఏ కేసూ దొరకక వీళ్ళను పట్టుకొచ్చారు' మనసులో నిశ్చయించుకున్నాడు జడ్జి.

"సరే నువ్వేం చేసావ్" రెండో వ్యక్తిని అడిగాడు.

"నేను కూడా రాళ్ళను నీటిలోకి విసిరాను సార్!" చెప్పాడు ఆ రెండో వ్యక్తి.

వారి మీద మరింత జాలి పెరిగింది జడ్జికి. ముగ్గురూ బుద్ధిమంతులులా కనబడ్డారు.

"నీవు కూడా రాళ్ళను నీటిలోకి విసిరావా?" అడిగాడు మూడో వ్యక్తిని.

"లేదు సార్ — నేనే రాయిని" చెప్పాడు ఆ వ్యక్తి.

— ఎ.ఫణిభూషణ్

ఈ బహుమతి పొందిన రచనల్లో మీకు నచ్చిన కాలమ్ దాటని కథ వివరాలు దిగువ ఇచ్చిన నమూనాలో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

- ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన కథ: ______________________

రచయిత/ రచయిత్రి: ______________________

పేజీ నంబరు: ______________________